


ముసుగు దొంగల హల్‌చల్

తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా దుండగులు గ్రామాల్లో హల్‌చల్ చేశారు. చోరీకి పాల్పడి నగదు, ఓ బైక్ ఎత్తుకెళ్లారు. 8లో▸



విలీనం చేసేదాకా పోరాటం

మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేసే దాకా పోరాటం ఆగదని జేఏసీ మండల చైర్మన్ రఘుపతి అన్నారు. 8లో▸



న్యూస్‌రీల్

భూ సేకరణ విరమించుకోవాలి



ఆర్డీఓ అనంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

యాచారం: పారిశ్రామిక పార్కుల పేరుతో చేపట్టే భూ సేకరణను విరమించుకోవాలని మండలంలోని మొండిగౌరెల్లి గ్రామ రైతులు డిమాండ్ చేశారు. గ్రామంలో 820 ఎకరాల అసైన్డ్, పట్టా భూముల సేకరణను వెంటనే నిలిపేయాలని కోరుతూ మంగళవారం ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంటలు పండే భూములను తీసుకుంటే జీవనోపాధి కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. భూ సేకరణను వెంటనే విరమించుకోకపోతే ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీఓ అనంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. రెండు, మూడు రోజుల్లో గ్రామాన్ని సందర్శించి సర్కార్‌కు నివేదిక ఇస్తానని ఆర్డీఓ హామీ ఇచ్చారు. అంతకు ముందు రైతులంతా సమావేశమై భూసేకరణను వ్యతిరేకంగా తీర్మానం చేశారు. కార్యక్రమంలో మర్పల్లి అంజయ్య యాదవ్, మేకల యాదగిరిరెడ్డి, తాండ్ర రవీందర్, బండిమీది కృష్ణ, నక్క శ్రీనువాస్ యాదవ్, కుంచారపు సందీప్‌రెడ్డి, మాదం జంగయ్య, బాల్‌రాజ్, పాండు యాదవ్, ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు ఇవ్వాలి



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: మధ్యాహ్న భోజనం కార్మికులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం చంద్రమోహన్ మధ్యాహ్న భోజనం పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్నతో కలిసి మాట్లాడారు. ఎనిమిది నెలల పెండింగ్ బిల్లులు, మూడు నెలల వేతనాలు వెంటనే ఇప్పించాలని అన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే ఈ నెల 24న జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో వంట బంద్ చేసి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పోచమోని కృష్ణ, మధ్యాహ్న భోజనం పథకం కార్మికులు జయమ్మ, సావిత్రి, రజిత, శివ రాణి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే కాలె యాదయ్య



చేవెళ్ల: అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం తెలిపిన సందర్భంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మంగళవారం అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లుపై మాట్లాడారు. మూడు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న వర్గీకరణను ఉభయ సభలు ఒకేరోజు ఆమోదించడం హర్షణీయమన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించిన ఫిబ్రవరి 24న తెలంగాణ సోషల్ జస్టిస్‌డేగా జరుపుకోవాలని ముఖ్యమంత్రి సూచించడం సంతోషకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముందడుగు వేసి ఇచ్చిన హామీని నిలబెట్టుకుందన్నారు. కులగణనపై కూడా సరైన నిర్ణయం తీసుకొని అన్ని వర్గాలకు న్యాయం చేసేందుకు కృషి చేస్తోందని పేర్కొన్నారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా వెంకట్‌రెడ్డి



మంచాల: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా మండల కేంద్రానికి చెందిన వింజమూరి వెంకట్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు రాష్ట్ర అధినాయకత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. సందర్భంగా మంగళవారం వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీలో క్రమశిక్షణతో కష్టపడి పని చేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. తన నియామకానికి సహకరించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

జఠిలం

మున్సిపాలిటీల్లో తాగునీటికి ఇక్కట్లు

- మిషన్ భగీరథ నీరు అంతంత మాత్రమే..
- పలు కాలనీలకు దిక్కవుతున్న బోరునీరు
- ప్రైవేటు ట్యాంకర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి

మున్సిపాలిటీల్లో తాగునీటికి తిప్పలు తప్పడం లేదు.. కొత్తగా వెలుస్తున్న కాలనీలు.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నీటి సరఫరా కావడం లేదు.. మిషన్ భగీరథ నీరు సరిపోవడం లేదు.. కొన్ని చోట్ల బోర్లు, ట్యాంకర్ల ద్వారా ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నా.. ప్రైవేటు ట్యాంకర్లను ఆశ్రయించక తప్పడం లేదు. మరి కొన్ని చోట్ల పైపులైన్ల లీకేజీలు, మరమ్మతులతో రోజుల తరబడి అంతరాయం కలుగుతోంది. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే వేసవి తీవ్రత పెరిగితే ఎలా ఉంటుందోనని 'పుర' ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కొంగరకలాన్‌లో ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా

❖ జనాభాకు తగ్గట్టు లేని సరఫరా

ఇబ్రహీంపట్నం: జనాభా అవసరాలకు తగ్గట్టు మిషన్ భగీరథ మంచినీళ్ల సరఫరా కావడం లేదు. మున్సిపాలిటీ పరిధిలో 45 నుంచి 50 వేల జనాభా నివసిస్తున్నారు. 7,500 నల్లా కనెక్షన్లు ఉన్నాయి. నిత్యం 50 లక్షల లీటర్ల తాగునీరు అవసరం ఉండగా 39 లక్షల నుంచి 41 లక్షల లీటర్ల లోపే సరఫరా అవుతోంది. మరో పది లక్షల లీటర్ల కోసం ఇతరత్రా మార్గలపై ఆధారపడాల్సి వస్తోంది. వేసవి వచ్చిందంటే చాలు నీటి ఎద్దడి షరా మామూలే అవుతోంది. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టినట్టు మున్సిపల్ యంత్రాంగం చెబుతోంది. మున్సిపల్ పరిధిలోని 102 బోర్లకు మరమ్మతులు, ఫ్లషింగ్ చేయించామని, సుమారు 5 లక్షల లీటర్ల నీటిని ఈ బోర్ల ద్వారా ప్రజలు ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. 5,500 లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకర్ ద్వారా రోజుకు నాలుగైదు ట్రిప్పులు ఆయా బస్తీల్లో సరాఫరా చేస్తున్నట్టు పేర్కొన్నారు.



ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ తెప్పించుకున్న ఓ ఇంటి యజమాని

నీటి ఎద్దడి తీవ్రమైతే మరో రెండు ప్రైవేట్ వాటర్ ట్యాంకర్లతోపాటు కొత్తగా రెండు బోర్లను వేసేందుకు ఉన్నతాధికారులతో అనుమతులు పొందినట్టు చెప్పారు.

ప్రైవేట్ వాటర్ ట్యాంకర్లకు గిరాకీ

ఎండలు ముదురుతుండటంతో తాగునీటి సమస్య ఉత్పన్నం అవుతోంది. కొత్తగా వెలసిన కాలనీల్లో పంపిణీ సక్రమంగా లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రైవేట్ వాటర్ ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. రూ.500 చొప్పున ట్యాంకర్ నీటిని పంపిణీ చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం

వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. పెరుగుతున్న జనాభాకు తగ్గట్టు మిషన్ భగీరథ నీరు పంపిణీ కావడం లేదు. ఇక్కడున్న నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. కొత్త బోర్లు వేసేందుకు, ప్రైవేట్ వాటర్ ట్యాంకులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాం.

– రవీంద్రసాగర్, మున్సిపల్ కమిషనర్



❖ కొత్త కాలనీల్లో సమస్య

శంకర్‌పల్లి: మున్సిపాలిటీలో సుమారు 7వేల వరకు నివాసాలు ఉన్నాయి. 4,592 నివాసాలకు గాను మిషన్ భగీరథ కనెక్షన్లు ఉన్నాయి. మిగతా నివాసాలకు బోర్లు, ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్నారు. కాలక్రమేణా పట్టణం విస్తరిస్తోంది. కొత్త కాలనీలు వెలుస్తున్నాయి. భారీగా నిర్మాణాలు జరగుతున్నాయి. కొత్తగా ఏర్పడుతున్న కాలనీల్లో తాగునీటి సమస్య తప్పడం లేదు. అధికారులు పైప్‌లైన్ లేని చోట్ల రెండు ట్యాంకర్ల ద్వారా, పైప్‌లైన్లు ఉన్న చోట సమీపంలోని బోర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఇప్పటి వరకు సాయి కాలనీ, శ్రీరాంనగర్, సాయిబాబా టెంపుల్, పోలీస్ క్వార్టర్స్ ఏరియాలో పైపులైన్ మరమ్మతులు, లీకేజీ పనులు పూర్తయ్యాయి. రిత్విక్ వెంచర్, మైనార్టీ కాలనీల్లో ఇతరత్రా పనుల కారణంగా పైప్‌లైన్ పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. పట్టణంలోని రెడ్డి కాలనీ, బోప్పన్న వెంచర్, ఆదర్శ్‌నగర్, క్రిస్టల్ వెంచర్–1లో కొత్తగా లైన్లు వేయాల్సి ఉంది.



శ్రీరాంనగర్ కాలనీకి వెళ్లే దారిలో పైప్‌లైన్ మరమ్మతు కోసం తవ్వకం

అవసరం ఉన్న చోట కొత్త బోర్లు

మున్సిపాలిటీలో మొత్తం 116 బోర్లు ఉన్నాయి. వాటిలో 84 పని చేస్తుండగా.. 32 పని చేయడం లేదు. నీటి వనరులు ఉన్న బోర్లను గుర్తించి వారం రోజుల్లో మరమ్మతులు చేయిస్తాం. అవసరం ఉన్న చోట కొత్త బోర్లు వేసేందుకు ప్రణాళికలు రూపొందించాం. టెక్నికల్ అనుమతుల కోసం వేచి చూస్తున్నాం.

– యోగేశ్, మున్సిపల్ కమిషనర్

❖ బోరు నీరే ఆధారం

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధిలో మొత్తం 14,500 తాగునీటి కనెక్షన్లు ఉండగా, నిత్యం 78 లక్షల లీటర్ల సరఫరా అవసరం ఉంది. 68 లక్షల లీటర్లు మాత్రమే ఉండటంతో సరిపడా సరఫరా కావడం లేదు. దీంతో ప్రజలకు నీటి తిప్పలు తప్పడం లేదు. నెల రోజులుగా సరిపడా నీరు రాకపోవడంతో బోర్లపైనే ఆధారపడాల్సి వస్తోంది. బోరు నీటి వసతి లేని వారు ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. జలమండలి కానీ మున్సిపాలిటి కానీ ప్రత్యేకంగా ట్యాంకర్లను ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేటు ట్యాంకర్లను తెప్పించుకోక తప్పడం లేదు. మున్సిపాలిటీలో చేపడుతున్న పలు అభివృద్ధి పనుల కారణంగా నీటి స రఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. చాలా కాలనీల్లో సీసీ రోడ్లు, అంతర్గత డ్రైనేజీ నిర్మాణ పనులు కొనసాగుతుండటంతో పైప్‌లైన్లు ధ్వంసం అవుతున్నాయి. జలమండలి అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టకపోవడంతో పలు చోట్ల రోజుల తరబడి సరఫరా నిలిచిపోతోంది. దీనిపై జలమండలి మేనేజర్ వినయ్‌ను వివరణ కోరగా పైప్‌లైన్‌ల మరమ్మతులను వేగంగా చేపడుతున్నామని, అదనంగా సిబ్బందిని సైతం నియమించుకున్నట్టు తెలిపారు. నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.



పైప్‌లైన్‌కు మరమ్మతు

❖ మిషన్ భగీరథ.. అంతంతే..



హిమాయత్‌నగర్‌లో మిషన్ భగీరథ ట్యాంక్

మొయినాబాద్: కొత్తగా ఏర్పడిన మొయినాబాద్ మున్సిపాలిటీలో వేసవి ఆరంభంలోనే నీటి కష్టాలు మొదలయ్యాయి. మిషన్ భగీరథ నీళ్లు సరిగా రాకపోవడంతో కొన్ని గ్రామాలు, కాలనీల్లో బోర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. మున్సిపల్ కేంద్రంలోని లక్ష్మీగణపతి నగర్ కాలనీ, భరద్వాజ్ కాలనీ, ముస్తఫాహిల్ కాలనీలకు మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదు. నెల రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో ఆయా కాలనీల్లో ఉన్న బోర్ల ద్వారానే సరఫరా చేస్తున్నారు. లక్ష్మీగణపతి నగర్ కాలనీలో బోర్ల నుంచి ఇళ్లలోకి నేరుగా పైపులు వేసుకుంటున్నారు. పెద్దమంగళారం గ్రామానికి సైతం మిషన్ భగీరథ నీళ్లు సరిగా రావడం లేదు. వచ్చిన నీటిని అరగంటసేపు మాత్రమే ఇళ్లలోకి వదులుతున్నారు. చిలుకూరులోని రాజీవ్ గృహకల్ప కాలనీకి మిషన్ భగీరథ పైప్‌లైన్ ఇప్పటి వరకు వేయలేదు. అక్కడ బోర్ల ద్వారానే నీళ్లు అందిస్తున్నారు. ప్రస్తుతం బోర్లలో సైతం నీళ్లు తగ్గుముఖం పట్టాయి. రానున్న రోజుల్లో బోర్లు ఎండిపోతే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని కాలనీవాసులు వాపోతున్నారు. హిమాయత్‌నగర్‌లో మిషన్ భగీరథ పైప్‌లైన్లు తరచూ లీకేజీ అవుతున్నాయి. రెండు నెలల కాలంలో పది చోట్ల పైప్‌లైన్లు లీక్ అయ్యాయి. రెండు రోజుల క్రితం సైతం హిమాయత్‌నగర్‌లోని ఎస్సీ కాలనీలో పైప్‌లైన్ లీకేజీ కావడంతో కాలనీకి నీటి సరఫరా నిలిచిపోయింది.

సమస్యలు రాకుండా చూస్తున్నాం



గతంలో ఉన్న జనాభా ప్రకారం మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయి. ప్రస్తుతం కాలనీలు పెరగడంతో ఆ నీళ్లు సరిపోవడం లేదు. మిషన్ భగీరథ నీళ్లు రానిచోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం. బోర్ల ద్వారా నీటిని అందిస్తున్నాం. వేసవి మొదలు కావడంతో నీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– ఖాజా మొయిజుద్దీన్, మున్సిపల్ కమిషనర్

❖ ప్రత్యామ్నాయ చర్యలు

కొత్తూరు: మున్సిపాలిటీ పరిధిలో 12 వార్డులు ఉన్నాయి. 6,200 మిషన్ భగీరథ కుళాయిలు ఉన్నాయి. వేసవిలో నీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మున్సిపల్ అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నీటి ఎద్దడి ఏర్పడితే ఇప్పటికే మరమ్మతులు చేసిన 22 బోరుబావుల ద్వారా సరఫరా చేస్తామని చెబుతున్నారు. ప్రస్తుతానికి అన్ని వార్డుల్లో నీటి సరఫరా సక్రమంగా ఉందని, ఎక్కడా పైపులైన్ల మరమ్మతులు కూడా లేవని తెలిపారు. నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



నారాయణగూడ కాలనీలో ట్యాంక్

❖ లీకేజీలు.. మరమ్మతులు

చేవెళ్ల: మిషన్ భగీరథ పథకంతో ఇంటింటికీ నల్లా కనెక్షన్లతో నీటి సమస్య కొంత మేరకు తీరినా పైపులైన్ల లీకేజీలు, మరమ్మతుల కారణంగా అక్కడక్కడా సమస్యలు ఎదురవుతున్నాయి. మున్సిపల్ పరిధిలో 19 వేల జనాభా ఉంది. పలు కాలనీల్లో పైపులైన్ లీకేజీల కారణంగా చేపడుతున్న మరమ్మతులతో స్థానికులు నీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణ కేంద్రంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో మరమ్మతులతో వారంరోజుల పాటు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఎట్టకేలకు అధికారులు మరమ్మతులు పూర్తి చేసి పునరుద్ధరించారు. మున్సిపల్ పరిధిలోని ఊరేళ్లలో నీటి సమస్య ఏర్పడడంతో చర్యలకు ఉపక్రమించారు. వేసవిలో నీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలతోపాటు అప్రమత్తంగా ఉన్నట్లు చెబుతున్నారు. ముందు జాగ్రత్త చర్యగా 35 లక్షల లీటర్ల ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించినట్లు తెలిపారు. ఇప్పటికే సమస్యలున్న ప్రాంతాలను గుర్తించామని, ఎక్కువ ఇబ్బంది వస్తే ట్యాంకర్ల ద్వారా నీటిని అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.



హౌసింగ్‌బోర్డు కాలనీలో పైపులైన్‌కు మరమ్మతులు

❖ రోజు విడిచి రోజు..

బడంగ్‌పేట్: నాదర్‌గుల్, బడంగ్‌పేట్, గుర్రంగూడ, కుర్మల్‌గూడ, అల్మాస్‌గూడ, మల్లాపూర్, వెంకటాపూర్, బాలాపూర్, మామిడిపల్లి ప్రాంతాలను కలుపుతూ మిషన్ భగీరథ పథకం కింద పది లక్షల నీటి నిల్వ సామర్థ్యం ఉన్న 13 ట్యాంకులు నిర్మించారు. మీర్‌పేట, జిల్లెలగూడ, వినాయకహిల్స్, తిరుమల నగర్ ప్రాంతాలను కలుపుతూ మరో లైన్ ఏర్పాటు చేశారు. మిషన్ భగీరథ ట్యాంకుల నిర్మాణంతో పాటు పైప్‌లైన్లు ఏర్పాటు చేసి రోజువిడిచి రోజు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. 5వ డివిజన్, ఇతర కాలనీల్లో వారానికి ఒకసారి కృష్ణా నీరు వచ్చేది. ఇటీవలే సమస్యను పరిష్కరించి రోజువిడిచి రోజు సరఫరా చేస్తున్నారు. సాయినగర్ కాలనీలో నీటి సరఫరా సరిగ్గా కావడం లేదని కొంత కాలంగా ఫిర్యాదులు వస్తున్నాయి. క్షేత్ర పరిశీలన చేసి కొత్తలైన్ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరిస్తామని జలమండలి అధికారులు చెబుతున్నారు.



బడంగ్‌పేటలోని మిషన్ భగీరథ ట్యాంక్

❖ ఆదిబట్లలో తాగునీటి కటకట

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీలో తాగునీటి కటకట తప్పడం లేదు. మున్సిపాలిటీలో మొత్తం 22,953 మంది జనాభా ఉండగా, 5,898 నివాసాలు ఉన్నాయి. 3,329 మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లు, 900కు పైగా మెట్రోవాటర్ నల్లా కనెక్షన్లు ఉన్నాయి. మిషన్ భగీరథ ద్వారా రోజు తప్పించి రోజు 3 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు. మెట్రోవాటర్ ద్వారా రోజు విడిచి రోజు గంట, గంటన్నర పాటు సరఫరా చేస్తున్నారు. నీరు సరిపడా రాక ఆదిబట్ల, బొంగ్లూర్, మమ్మరాజీగూడ వాసులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. మున్సిపల్ పరిధిలోని 15 వార్డుల్లోనూ తిప్పలు తప్పడం లేదు. ఒకవైపు బోరు నీరు, మరోవైపు ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నారు. కొంగరకలాన్, కొంగరకలాన్ తండాకు శాశ్వత పరిష్కారం చూపడం లేదు. నిత్యం ట్యాంకర్ల ద్వారా కొనుగోలు చేయాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. గంగానగర్, కొంగరకలాన్, మంగళ్‌పల్లి ఎక్స్‌రోడ్డు, టీసీఎస్ ముందు, ఎంపీపటేల్‌గూడ, బొంగ్లూర్, సాయిబాలాజీ, అంతఃపురం కాలనీ, విజయలక్ష్మి నగర్, మెట్రోసిటీ, మంగళ్‌పల్లి ఇందిరమ్మ కాలనీ, భరద్వాజా ఎన్‌క్లేవ్ కాలనీలకు సైతం నీరు రావడం లేదని స్థానికులు అంటున్నారు. బోరు నీరే దిక్కవుతోందని చెబుతున్నారు.

ఎద్దడి లేకుండా చూడాలి



అధికారులు నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి. సమస్య ఉన్న ప్రాంతాల్లో ఇబ్బందులు లేకుండా చూడాలి. ఎండలు మరింత తీవ్రం కాకముందే చర్యలు తీసుకోవాలి. అప్పుడే ఇబ్బందులు తప్పుతాయి.

– పైళ్ల శ్రీనివాస్‌రెడ్డి, బొంగ్లూర్

ట్యాంకర్లతో సరఫరా




కొత్త కాలనీలకు నీరు అందడం లేదు. ఇప్పటికే ఉన్న బోర్లు బాగు చేయించాం. కృష్ణనీరు, మెట్రోవాటర్ అందని ప్రాంతాలకు బోరు నీరు అందిస్తున్నాం. అవసరమైతే 24 గంటలు ట్యాంకర్లు అందుబాటులో ఉన్నాయి. వాటి ద్వారా సరఫరా చేస్తున్నాం.

– బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్

❖ బోర్లు.. ట్యాంకర్లతో సరఫరా

ఆమనగల్లు: మున్సిపాలిటీ జనాభాకు అనుగుణంగా నీటి సరఫరా లేకపోవడంతో కొన్ని కాలనీల్లో నీటికోసం ఇబ్బందులు తప్పడం లేదు. పలు కాలనీలకు బోర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. నీటి సరఫరా లేని కాలనీలకు ట్యాంకర్ల ద్వారా అందిస్తున్నారు. జనాభాకు అనుగుణంగా ట్యాంక్‌ల నిర్మాణం చేపట్టలేదు. ప్రతిరోజు 25 లక్షల లీటర్ల నీరు అవసరం ఉండగా మిషన్ భగీరథ ద్వారా 19 లక్షల లీటర్ల సరఫరా జరుగుతోంది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో కొన్ని కాలనీలకు బోర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. పట్టణంలోని బీసీ కాలనీ, విద్యానగర్ కాలనీలకు బోర్ల ద్వారానే సరఫరా చేస్తున్నారు. కొన్ని కాలనీలకు ట్యాంకర్ల ద్వారా పంపిణీ చేస్తున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే ఎండలు తీవ్రమైతే ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన వ్యక్త చేస్తున్నారు.



ఆమనగల్లులో నీటి సరఫరాకు సిద్ధంగా ఉన్న వాటర్‌ట్యాంకు

పైప్‌లైన్ నిర్మించాలి



మా కాలనీకి మిషన్ భగీరథ నీరు రావడం లేదు. కాలనీలో ఉన్న బోరు ద్వారా సరఫరా చేస్తున్నారు. నూతనంగా పైప్‌లైన్ నిర్మించి మిషన్ భగీరథ నీరు అందించాలి. కాలనీలో సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించాలి.

– అనిత, విద్యానగర్ కాలనీ, ఆమనగల్లు

ఇబ్బంది లేకుండా చూస్తాం



మిషన్ భగీరథ నీరు అందని కాలనీలకు బోర్ల ద్వారా అందిస్తున్నాం. అవసరమైన చోట నూతన పైప్‌లైన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. వేసవిలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం.

– శంకర్, మున్సిపల్ కమిషనర్

కడచూపు కోసం.. కన్నీటి పయనం

షాద్‌నగర్: విదేశీ ప్రయాణం అంటే సంతోషంగా ముందుకు సాగుతారు.. అక్కడే స్థిరపడి, జీవితంలో ఎంతో ఎత్తుకు ఎదిగిన పిల్లలు, బంధువులను చూసేందుకు రెట్టించిన ఉత్సాహంతో సిద్ధమవుతారు. కానీ కొందుర్గు మండలం టేకులపల్లికి చెందిన మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి, పవిత్ర దంపతుల అమెరికా ప్రయాణం కన్నీటి మయమైంది. ఫ్లోరిడాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన తమ కూతురు ప్రగతిరెడ్డి, మనవడు హర్వీన్ రెడ్డి, వియ్యంకురాలు సునీతారెడ్డిని చివరిసారిగా చూసేందుకు మంగళవారం వారు బయల్దేరారు. ఈ క్రమంలో టేకులపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. కూతురు, మనుమడిని తలచుకుంటూ బాధితులు రోదించిన తీరు అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. మృతదేహాలను ఇండియా తెప్పించేందుకు వీలు కావడంలేదని, అమెరికాలోనే అంత్యక్రియలు నిర్వహిస్తామని ప్రగతి అత్తింటి వారి నుంచి సమాచారం రావడంతో బరువెక్కిన హృదయాలతో వెళ్లారు.

పలువురి పరామర్శ

అమెరికాకు పయనమైన మోహన్‌రెడ్డి దంపతులు టేకులపల్లి నుంచి నగరంలోని కొత్తపేటలో ఉన్న తమ నివాసానికి చేరుకున్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి, ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ కుమార్‌రెడ్డి వీరిని కలిసి ఓదార్చారు.



పవిత్రను ఓదారుస్తున్న సబితారెడ్డి

అంగన్‌వాడీలపై పని భారం తగ్గించాలి

ఇబ్రహీంపట్నం రూరల్: అంగన్‌వాడీలపై పని భారం తగ్గించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.జగదీష్ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్స్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట 48 గంటల పాటు ధర్నా చేపట్టారు. సోమవారం రాత్రి అక్కడే కార్మికులు, ఉద్యోగులు బస చేశారు. వంటా వార్పు చేసుకొని మంగళవారం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ.. బడ్జెట్ సమావేశాల్లో ఐసీడీఎస్‌కు తగిన బడ్జెట్ కేటాయించాలని, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, 24 రోజుల సమ్మెకాలం వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 2వ పీఆర్‌సీ ప్రకారం 5 శాతం ఐఆర్‌ను వెంటనే వర్తింపజేయాలని కోరారు. అనంతరం ఐసీడీఎస్ డీడబ్ల్యూఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, ఉపాధ్యక్షుడు చంద్రమోహన్, సహాయ కార్యదర్శి డి. కిషన్, పోచమోని కృష్ణ, అంగన్‌వాడీ నాయకులు రాజ్యలక్ష్మి, బేబి, లక్ష్మి, దేవేందర్, ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ ప్రకారమే ఉద్యోగాల భర్తీ చేపట్టాలి

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహా


అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ ప్రకారమే ఉద్యోగాలను భర్తీ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహా డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకులు చేపట్టిన రిలే దీక్షలు మంగళవారంతో 9వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కోరుతూ అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. అనంతరం నర్సింహా మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ చేపట్టకుండా ఉద్యోగాలను భర్తీచేస్తే మాదిగలకు అన్యాయం జరుగుతుందని అన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం భర్తీ చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగాలన్నీ ఎస్సీ వర్గీకరణ ప్రకారమే నియామకాలు చేపట్టాలని కోరారు. మాదిగలకు న్యాయం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని అమలులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ అమలులోకి వచ్చేంత వరకు ఉద్యమాన్ని విరమించేది లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాండు, బాల్‌రాజ్, నాగభూషణం, సురేష్, మహేందర్, శ్రీనివాస్, శివశంకర్, యాదగిరి, చందు, శ్రీను, హరీష్, శ్రీశైలం, కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి సీజ్


రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ విజయలక్ష్మి


ఆస్పత్రిని సీజ్ చేస్తున్న అధికారులు

షాద్‌నగర్: వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఓ వ్యక్తి మృతి చెందాడన్న ఆరోపణల నేపథ్యంలో మంగళవారం వైద్యాధికారులు బాలాజీ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిని సీజ్ చేశారు. ఇటీవల కేశంపేట మండలం కోనాయపల్లికి చెందిన సామ్యనాయక్(50)కు జ్వరం రావడంతో వారి కుటుంబ సభ్యులు పట్టణంలోని పరిగి రోడ్డులో ఉన్న బాలాజీ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రికి తీసుకెళ్లగా ఆదివారం రాత్రి మృతిచెందాడు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా సామ్యనాయక్ మృతిచెందాడని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి ఆస్పత్రిని తనిఖీ చేశారు. సామ్యనాయక్‌కు సంబంధించిన అడ్మిషన్ రిజిస్టర్, పేషంట్ ల్యాబ్ రిపోర్టులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సామ్యానాయక్‌కు వైద్యం చేసిన డాక్టర్లు సింధు, అఖిల్, ఫైజల్‌తో మాట్లాడి వివరాలు సేకరించి ఆస్పత్రిని సీజ్ చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి తగు చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీయంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. తనిఖీలో పాల్గొన్న వారిలో డాక్టర్ నిఖిల్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఫార్మాసిస్టు ఉదయ్‌కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ వెంకటముని ఉన్నారు.

ఆశ్రమంలో భారీ చోరీ

- ఇంటి దొంగ పనే
- రూ.53 లక్షల నగదు, రూ.5 లక్షల విలువైన వజ్రాలు, రూ.60 లక్షల విలువ చేసే గడియారాలు అపహరణ
- విషయాన్ని గోప్యంగా ఉంచిన పోలీసులు

మొయినాబాద్: ఓ ఆశ్రమంలో భారీ చోరీ చోటు చేసుకుంది. ఈ ఘటనలో రూ.1.18లక్షల విలువ చేసే సొత్తు దోచుకెళ్లారు. చోరీ జరిగి నాలుగు రోజులు దాటినా పోలీసులు విషయాన్ని గోప్యంగా ఉంచారు. వివరాలు.. మొయినాబాద్ పీఎస్ పరిధిలోని శ్రీరాంనగర్ సమీపంలో శివగిరి ముక్తానంద్ స్వామికి చెందిన శ్రీ మా ఆశ్రమం ఉంది. ఈ నెల 1న స్వామిజీ రిషికేశ్, హిమాలయాలకు వెళ్లారు. ఈ క్రమంలో ఆశ్రమంలో పనిచేసే వ్యక్తులు 15న స్వామిజీ గదిలోకి వెళ్లి చూడగా కిటికీలు, లాకర్‌లు ధ్వంసమై ఉన్నాయి. ఇదే విషయాన్ని వారు స్వామిజీకి తెలిపారు. లాకర్‌లో ఉన్న రూ.53 లక్షల నగదు, రూ.60 లక్షల విలువైన తొమ్మిది గడియారాలు, రూ.5 లక్షల విలువ చేసే 15 వజ్రాలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించగా తెల్లవారు జామున 3 గంటల సమయంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి స్వామిజీ బెడ్‌రూంలోని బాత్‌రూం కిటికీ నుంచి లోపలికి వెళ్లి లాకర్‌లోని నగదు, వాచీలు, వజ్రాలు దోచుకెళ్లినట్లు గుర్తించారు. దీనిపై మొయినాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆశ్రమంలో పనిచేసే వ్యక్తే చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అయితే ఈ విషయాన్ని పోలీసులు బయటకు తెలియకుండా గోప్యంగా ఉంచారు. పోలీసు ఉన్నతాధికారులే విషయాన్ని గోప్యంగా ఉంచాలని చెప్పినట్లు మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్‌రెడ్డి చెప్పడం గమనార్హం.

చెరువు కట్ట పునరుద్ధరణ


జంబులకుంట చెరువు కట్టను పునరుద్ధరిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

మొయినాబాద్: శిఖం పట్టాలో ఉన్న చెరువు కట్టను తొలగించి నవారే పునరుద్ధరించారు. అధికారులు దగ్గరుండి మట్టి పోయించి కట్ట నిర్మాణం చేపట్టారు. బాకారం జాగీర్ రెవెన్యూలో జంబులకుంట చెరువు కట్టను నిబంధనలకు విరుద్ధంగా తొలగించడంపై 'పట్టాలు అడ్డుపెట్టి చెరువును చెరబట్టి' అనే శీర్షికతో ఆదివారం 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. అదే రోజు చెరువుకట్ట తొలగించిన ప్రదేశాన్ని పరిశీలించారు. చెరువు కట్ట తొలగించిన రైతునే పునరుద్ధరించాలని చెప్పారు. లేదంటే కేసు నమోదుచేస్తామని హెచ్చరించడంతో మంగళవారం రైతు మట్టి పోసి చెరువుకట్టను పునరుద్ధరించారు. ఇరిగేషన్ అధికారులు దగ్గరుండి జేసీబీ సహాయంతో చెరువు కట్ట పునఃనిర్మించారు. ఎవరైనా చెరువులు, కుంటల కట్టలు తొలగించినా, కాలువలు పూడ్చిన కఠిన చర్యలు ఉంటాయని ఇరిగేషన్ అధికారులు హెచ్చరించారు.

ఆటో బోల్తా

గాయపడిన ప్రయాణికులు

కొందుర్గు: చౌదరిగూడ మండల కేంద్రం సమీపంలో ఓ ఆటో బోల్తాపడి ప్రయాణికులు గాయపడ్డారు. మంగళవారం ఉదయం జిల్లేడ్ నుంచి చౌదరిగూడ వైపు ప్రయాణిస్తున్న ఆటో అదుపుతప్పి చౌదరిగూడ సమీపంలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న భీమమ్మ, చిన్నయ్య, రాజు గాయపడినట్లు సమాచారం. డ్రైవర్ రాజుకు ఫిట్స్ రావడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుందని స్థానికులు వెల్లడిస్తున్నారు. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

మొయినాబాద్ ఠాణాలో కేటీఆర్‌పై కేసు

మొయినాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఎం రేవంత్‌రెడ్డి ఫోటోలను బీఆర్ఎస్ నాయకులు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేశారంటూ నాలుగు రోజుల క్రితం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాణయ్య మొయినాబాద్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. కేటీఆర్ సూచనలతోనే బీఆర్ఎస్ నాయకులు ఫొటోలు మార్ఫింగ్ చేసి వైరల్ చేశారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో కేటీఆర్‌తోపాటు బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్‌రావు, డి.మచ్చు, కె.యాదగిరి, రవికిరణ్, మురళి, అనిల్, వర్ధన్, అఖిలపై కేసు నమోదు చేసినట్లు సీఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

సాదాసీదాగా ప్రమాణ స్వీకారం

భారీగా పోలీసుల బందోబస్తు

- సముచిత స్థానం కల్పించాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడి నిరసన


నూతన పాలకవర్గంతో ఎమ్మెల్యే యాదయ్య, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి


పోలీసు పహారా

శంకర్‌పల్లి: ఆరు నెలల క్రితం తీసుకున్న నిర్ణయం తారుమారవ్వడంతో శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమం మంగళవారం సాదాసీదాగా ముగిసింది. మార్కెట్ కమిటీ పాలవర్గం వివరాలతో సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీచేయగా.. మరునాడు ఉదయానికే అధికారులు ప్రమాణ స్వీకార ఏర్పాట్లు చేశారు. అసంతృప్తుల నుంచి నిరసన సెగ తగలకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నార్సింగి ఏసీపీ రమణగౌడ్ బందోబస్తు పర్యవేక్షించి పలు సూచనలిచ్చారు. అనంతరం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి సమక్షంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా గోవిందమ్మ, వైస్ చైర్మన్‌గా కాశెట్టి చంద్రమోహన్ ప్రమాణస్వీకారం చేశారు. 12 మంది డైరెక్టర్లకుగాను ఉదయం ఆరుగురు మాత్రమే ప్రమాణం చేశారు. మిగిలిన ఆరుగురిలో నలుగురు డైరెక్టర్లు కార్యక్రమం ముగిసే సమయానికి.. మరో ఇద్దరు చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ వెళ్లిపోయిన అనంతరం అధికారుల సమక్షంలో ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెట్ అధికారి ఎండీ రియాజ్, శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ యోగేశ్, పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి, నాయకులు ప్రవీణ్, గోపాల్‌రెడ్డి, ప్రకాశ్, వెంకట్‌రాంరెడ్డి, పాండురంగారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివాదం మొదలైంది ఇలా ..

శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి భార్యకు ఇవ్వాలని పార్టీ, ఎమ్మెల్యే, నాయకులు అంతా కలిసి ఆరు నెలల క్రితమే ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తల పేర్లతో ఆర్డర్‌కాపీ సైతం సిద్ధమైంది. ఈ క్రమంలో జనార్ధన్‌రెడ్డి స్వగ్రామం కొండకల్‌లో ప్రైవేట్ కంపెనీల వ్యతిరేకంగా గిరిజనులు భూ పోరాటం చేస్తున్నారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు సహకారంతో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. అనంతరం నిర్వహించిన ప్రెస్ మీట్‌లో జనార్ధన్‌రెడ్డి పాల్గొనడంతో కొంతమంది నాయకులు విషయాన్ని పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. నాటినుంచి పెండింగ్‌లో ఉంచిన శంకర్‌పల్లి ఏఎంసీకి చైర్‌పర్సన్‌గా జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు గోవిందమ్మ, వైస్‌చైర్మన్‌గా చంద్రమోహన్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో వివాదం మొదలైంది.

స్థానం కల్పించాలి.. లేదంటే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తా

జనార్ధన్‌రెడ్డి తన ఇంట్లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ.. ఎంతో కాలంగా కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా ఉంటూ, కష్టపడి పని చేశాను. సొంత గ్రామంలో తలెత్తిన సమస్యకు మద్దతిచ్చాను తప్పా పార్టీకి ఎక్కడా వ్యతిరేకంగా మాట్లాడలేదు. తమకు కేటాయించిన పదవిని మరొకరికి కేటాయిస్తామని సమాచారం ఇవ్వకపోవడం బాధాకరం. ప్రస్తుత ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు సైతం బీఆర్ఎస్ సమావేశాలకు వెళ్లారు. ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదన్నారు. తనకు సముచిత స్థానం కల్పించని ఎడల భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ కార్యదర్శి ఉదయ్‌మోహన్‌రెడ్డి, నూతన డైరెక్టర్లు రవీందర్‌రెడ్డి, ప్రశాంత్, నాయకులు అనిల్, ప్రశాంత్, బల్వంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ 'ఉపాధి' నిధులు విడుదల చేయాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను నాయక్


కూలీలతో మాట్లాడుతున్న శ్రీను నాయక్

షాద్‌నగర్: పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పీర్లగూడ, చించోడ్, అయ్యవారిపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలను వారు పని చేస్తున్న ప్రదేశాల్లో కలిశారు. ఈ సందర్భంగా శ్రీను నాయక్ మాట్లాడుతూ.. ఉపాధి పథకంలో పని చేస్తున్న కూలీలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమయిందని ఆరోపించారు. పని ప్రదేశాల్లో తాగునీరు, టెంట్లు, వైద్య సదుపాయం కల్పించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ కూలీలకు ప్రభుత్వం రోజువారీ కూలీ రూ.300 నుంచి రూ.800లకు పెంచాలని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా భూమి లేని పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి జాబ్‌కార్డులను ఇచ్చి పని కల్పించాలని డిమాండ్ చేశారు. కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు మల్లేష్, కిట్టు, చంద్రకాంత్, శ్రీను, యాదయ్య, శంకర్ నాయక్, శివ శంకర్, ఆంజనేయులు, కృష్ణయ్య, రాంచంద్రయ్య, ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

27న ఫార్మా రద్దుకు పాదయాత్ర

- 28న కలెక్టరేట్ ఎదుట ధర్నా
- సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య


మాట్లాడుతున్న యాదయ్య

యాచారం: గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. ఆ పార్టీ మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ అధ్యక్షతన మంగళవారం యాచారంలో నిర్వహించిన సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఫార్మాసిటీని వ్యతిరేకించిన కాంగ్రెస్ పార్టీ, తాము అధికారంలోకి వస్తే రద్దు చేస్తామని ప్రకటించిందని గుర్తుచేశారు. అంతేకాకుండా రైతుల నుంచి సేకరించిన భూములను తిరిగి ఇచ్చేస్తామని పేర్కొందన్నారు. ఫార్మాసిటీ భూసేకరణలో పెద్ద భూ కుంభకోణం జరిగిందని, దీనిపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో అధికారులు వ్యవహరిస్తున్న తీరు అనుమానాలు కలిగిస్తోందని తెలిపారు. ఫార్మాసిటీ రైతులకు మద్దతుగా, భూరికార్డుల్లో టీజీఐఐసీ పేరు తీసేసి రైతుల పేర్లు నమోదు చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 27న నక్కర్తమేడిపల్లి నుంచి వందలాది మంది రైతులతో పాదయాత్ర నిర్వహిస్తామని, 28న జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామని లిపారు. ఈ కార్యక్రమనికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ, జిల్లా కమిటీ సభ్యుడు పి.అంజయ్య, నాయకులు బ్రహ్మయ్య, జంగయ్య, చందునాయక్, పెద్దయ్య, జగన్, వెంకటయ్య, తావునాయక్ తదితరులు పాల్గొన్నారు.


ఉపాధి కల్పనకు కృషి

కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్‌రెడ్డి


జాబ్‌మేళాలో ధ్రువీకరణ పత్రాలు స్వీకరిస్తున్న శేఖర్‌రెడ్డి, ప్రతినిధులు

ఇబ్రహీంపట్నం రూరల్: నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంకాల శేఖర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఎల్మినేడులో లీడింగ్ ఎలక్ట్రానిక్ కంపెనీ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. నిరుద్యోగ యువత జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉద్యోగులకు 68 మంది దరఖాస్తు చేసుకోగా 52 మందిని స్పాట్ సెలక్షన్ చేశారన్నారు. త్వరలోనే మిగిలిన వారికి ఉద్యోగాలు ఇప్పించే బాధ్యత తీసుకుంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో లీడింగ్ ఎలక్ట్రానిక్ కంపెనీ డైరెక్టర్ ఉష, మేనేజర్ భారతి, కాంగ్రెస్ అధ్యక్షులు యాదగిరి, సీనియర్ నాయకులు జంగయ్య, సురేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గోవులను తరలిస్తున్న వాహనాల అడ్డగింత


గోవులను తరలిస్తున్న వాహనాలను అడ్డుకున్న బజరంగ్‌దళ్, బీజేవైఎం నాయకులు

చేవెళ్ల: అక్రమంగా తరలిస్తున్న గోవులను చేవెళ్ల బజరంగ్‌దళ్, బీజేవైఎం, హిందూ సంఘాల నాయకులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మంగళవారం సర్దార్‌నగర్ నుంచి చేవెళ్ల మీదుగా హైదరాబాద్ మీదుగా తరలిస్తున్న వాహనాలను గుర్తించిన బీజేపీ అనుబంధ సంఘాల నాయకులు అడ్డుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు గోవులను నార్సింగి పరిధిలోని గోశాలకు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమంగా పశువులను రవాణా చేస్తున్న వాహనాలను సీజ్ చేసి సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బజరంగ్‌దళ్ నాయకులు అనిల్‌కుమార్, సహా ప్రముఖ గణేశ్, ధర్మ రక్షా ప్రముఖ్ రాఘవేంద్రచారి, కావలి శివకుమార్, అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

విలీనం చేసేంతవరకు పోరాటం

- మహేశ్వరం ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ రఘుపతి


మాట్లాడుతున్న రఘుపతి

మహేశ్వరం: మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలని మహేశ్వరం ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ వత్తుల రఘుపతి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని కర్నాటి మనోహర్ కాంప్లెక్స్‌లో అఖిలపక్షం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘుపతి మాట్లాడుతూ.. మండల పరిధిలోని తుమ్మలూరు, మెహబూబ్‌నగర్‌లను మాత్రమే ఫ్యూచర్ సిటీలో విలీనం చేయడం సరికాదన్నారు. ఎన్నికల సమయంలో అన్ని పార్టీలు మహేశ్వరాన్ని మహానగరంగా మార్చుతామని ఉచిత హామీలిచ్చి మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహేశ్వరం నియోజకవర్గంలో ఫ్యూచర్‌సిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి కేవలం రెండు గ్రామాలను విలీనం చేసి అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్, అంతర్జాతీయ విమానాశ్రయం, ఓఆర్ఆర్‌కు అతి చేరువలో ఉన్న మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేయకపోవడం సరికాదన్నారు. త్వరలో అన్ని పార్టీలు, ప్రజాసంఘాలను ఐక్యం చేసి ఫ్యూచర్ సిటీలో మండలపరిధిలోని అన్ని గ్రామాలను కలిపేవరకు ఉద్యమిస్తామన్నారు. నియోజకవర్గంలో స్థానికేతలరులను గెలిపిస్తే తమ ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే సబితారెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబులను కలిసి సీఎం రేవంత్‌రెడ్డికి కలిసి తమ సమస్యలను విన్నవిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యూచర్ సిటీ జేఏసీ కమిటీ సభ్యులు మనోహర్, కదారి జంగయ్య, కాకి ఈశ్వర్, మల్లేశ్ యాదవ్, అంధ్యా నాయక్, నందిగామ నర్సింహ, ఆవుల యాదయ్య, యాదయ్య గౌడ్, యాదగిరి గౌడ్, దత్తు నాయక్, రవికుమార్, రాజు నాయక్, సుదర్శన్ యాదవ్, యాదీష్, కృష్ణా నాయక్, రమేష్, ఆంజనేయులు, శ్రావణ్ పాల్గొన్నారు.

ముసుగు దొంగల హల్‌చల్


బీరువాను ధ్వంసం చేసిన దుండగులు


సీసీ కెమెరాలో రికార్డు అయిన దృశ్యం

మూడు గ్రామాల్లో చోరీలు

- నగదు, బైక్ ఎత్తుకెళ్లిన దుండగులు

చేవెళ్ల: తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా ముగ్గురు దుండగులు మూడు గ్రామాల్లో హల్‌చల్ చేశారు. మూడు ఇళ్లల్లో చోరీకి పాల్పడి నగదు, ఓ బైక్ ఎత్తుకెళ్లారు. ఈ ఘటన చేవెళ్ల ఠాణా పరిధిలోని సింగప్పగూడ, రామన్నగూడ, న్యాలట గ్రామాల్లో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. సింగప్పగూడలో శేఖర్‌రెడ్డి తన ఇంటికి తాళం వేసి శంషాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లాడు. గమనించిన దుండగులు తాళం పగులగొట్టి రూ.8 వేల నగదు ఎత్తుకెళ్లారు. అదే గ్రామానికి చెందిన కుమ్మరి మహేందర్ ఇంటికి తాళం వేసి మరోగదిలో నిద్రించాడు. ఆయన పడుకున్న గదికి గడియ పెట్టి తాళం వేసిన ఇంట్లో రూ.6 వేల నగదు దోచుకెళ్లారు. న్యాలటకు చెందిన కానిస్టేబుల్ అశోక్ తన కుటుంబ సభ్యులతో ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ ఇంట్లో చొరబడిన దొంగలు రూ.10 వేలు దొంగలించారు. సింగప్పగూడలో రంగారెడ్డి ఇంటి ఎదుట పార్క్ చేసిన బైక్‌తో పరారవుతుండగా మార్గమధ్యలో రామన్నగూడ వద్ద బైక్‌లో పెట్రోల్ అయిపోవడంతో ద్విచక్రవాహనం నిలిచిపోవడంతో అక్కడే వదిలేశారు. రామన్నగూడ గ్రామంలోకి వెళ్లి అక్కడ గ్రామానికి చెందిన షఫీ ఇంటి ఎదుట పార్కు చేసిన మరోబైక్‌తో పలాయనం చిత్తగించారు.

సీసీ కెమెరాకు చిక్కిన దుండగులు

మూడు గ్రామాల్లో దొంగలు పడినట్లు గుర్తించిన గ్రామస్తులు గ్రామాల్లోని సీసీ కెమెరా పుటేజీలు పరిశీలించారు. ముగ్గురు దుండగులు ముసుగులు ధరించి చేతిలో కత్తులు, రాడ్‌లు పట్టుకుని వచ్చినట్లు గుర్తించారు. తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని పక్కింటి వారు లేచి బయటకురాకుండా చుట్టూ ఉన్న ఇళ్లకు గడియలు పెట్టి చోరీలకు పాల్పడ్డారు. పోలీసులు మూడు గ్రామాల్లో క్లూస్‌టీంతో వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసుల దర్యాప్తు చేపట్టారు.